సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 3 । అక్టోబర్ । 2024



రైతు బజారు లేక బేజారు

రెండు నియోజకవర్గాలకు వ్యాపార కేంద్రమైన కదిరిలో రైతు బజారు లేక అటు రైతులు, ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దళారుల చేతిలో దారుణంగా మోసపోతున్నారు. 8లో



కిలో టమాట రూ.74

టమాట ధర భారీగా పెరిగింది. బుధవారం కక్కలపల్లి మండీలో కిలో గరిష్టంగా రూ.74 పలికింది. మార్కెట్‌కు సరుకు తక్కువగా వస్తుండటంతో డిమాండ్ పెరిగింది.

గరిష్టం/కనిష్టం
36.7°/22.4°

జిల్లా పరిధిలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గి ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



ఆర్‌ఎం కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: దసరా పండుగ కోసం ముఖ్యమైన పట్టణాలు, నగరాల నుంచి స్వస్థలాలకు చేరుకునే వారి కోసం జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) మధుసూదన్ తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 9వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు 100 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. ఇందులో హైదరాబాదుకు 30, బెంగళూరుకు 20, తిరుపతికి 10, చెన్నైకి 5, విజయవాడకు 5 సర్వీసులు తిప్పుతామన్నారు. అలాగే అనంతపురం–పుట్టపర్తి మధ్య 30 లోకల్ సర్వీసులు నడపనున్నట్లు వెల్లడించారు. ఆయా సర్వీసుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తారన్నారు. దూరప్రాంత ప్రయాణికులు www.apsrtconline.in వెబ్‌సైట్‌లో టికెట్లు ముందస్తుగా రిజర్వు చేసుకోవచ్చన్నారు. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాదుకు 10, బెంగళూరుకు 15, తిరుపతికి 5, విజయవాడకు 5, లోకల్‌సర్వీలు 20 మొత్తంగా 55 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డీపీటీఓ వెల్లడించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహాత్ములకు ఘన నివాళి

- ఘనంగా మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి



మహాత్మాగాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్/ప్రశాంతి నిలయం: మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గాంధీజీ బోధించిన శాంతి, అహింసా మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. నిస్వార్థ రాజకీయాలతో తాను అలంకరించిన పదవులకే లాల్ బహదూర్ శాస్త్రి వన్నె తెచ్చారని కొనియాడారు.



ఎస్పీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

మాత్రలకూ దిక్కులేదప్పా!



- ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల్లో నిండుకున్న మందులు
- ఇండెంట్ పెట్టినా స్పందించని సర్కారు
- అత్యవసర మందులకూ దిక్కులేని పరిస్థితి
- బీ12 ఇంజెక్షన్లు లేక రోగుల విలవిల
- యాంటీబయోటిక్స్ లేక బయటికి చీటీలు రాస్తున్న వైద్యులు
- మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలోనూ మందుల కొరత
- గత ఐదేళ్లూ ఎప్పుడూ ఇలాంటి పరిస్థితే లేదు
- జ్వరాల సీజన్‌లో కొరత నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు



అనంతపురం సర్వజనాస్పత్రిలోని మందుల గది వద్ద జనం రద్దీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆస్పత్రుల్లో మందుల కొరత సామాన్య రోగులను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కూటమి సర్కారు వచ్చి నాలుగు నెలలు కూడా నిండక ముందే మందుల నిల్వలు పూర్తిగా కరిగిపోయాయి. దీంతో రోగులు బయట షాపుల్లో కొనుగోలు చేస్తున్న దుస్థితి నెలకొంది. ఆస్పత్రుల్లో మందులపై అడిగితే 'విజయవాడ నుంచే రావడం లేదు.. ఇండెంట్ పెట్టాం' అంటున్నారు. అసలే జ్వరాల సీజన్ కావడంతో రోగులు మందులు లేక సతమతమవుతున్నారు. గడిచిన ఐదేళ్లు ఒక్క ఆస్పత్రిలో కూడా మందులు లేవు అనే మాట వినిపించలేదు.

మంత్రి సొంత ఇలాకాలోనూ దుస్థితి..

ప్రస్తుతం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సత్యకుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలోనే మందులు లేక డాక్టర్లు బయటకు చీటీలు రాస్తున్నారు. 25 రకాలకు పైగా మందులు లేవు. స్వయానా ఓ అమాత్యుడి నియోజకవర్గంలోనే ఇలాంటి దుస్థితి నెలకొనడం విస్మయానికి గురిచేస్తోంది.



❐ ఈ ఫొటోలో కన్పిస్తున్న బాలింత పేరు జ్యోతి. యాడికి మండలం వెంకటాంపల్లి గ్రామం. బత్తలపల్లి ఆస్పత్రిలో సిజేరియన్ జరిగిన తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి వచ్చింది. వైద్యం అందించడంలో భాగంగా సర్వజనాస్పత్రి గైనిక్ వైద్యులు జ్యోతికి పారాసిటమాల్ ఇంజెక్షన్లు, డైరోనార్మ్, పారాసిట్ ఇన్ఫ్యూషన్ ఐవీ తదితరాలు కావాలని చెప్పారు. సర్వజనాస్పత్రిలో ఆ మందులు లేకపోవడంతో గత్యంతరం లేక జ్యోతి కుటుంబీకులు ప్రైవేట్ మందుల షాపులో కొనుగోలు చేశారు. రూ.2 వేల వరకూ ఖర్చు అయ్యింది.

సూదికీ, దూదికీ దిక్కులేదు..

ప్రమాదాల్లో గాయపడిన వారికి కుట్లు వేయడానికి సూది, దూది అత్యవసరం. కానీ కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇవి కూడా లేవు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన కొంత మంది రోగుల సహాయకులు బయటినుంచి దూది తెచ్చి డాక్టర్లకు ఇస్తున్నట్లు తేలింది. 2019 జూన్ నుంచి 2024 మార్చి వరకూ మందులకు లోటు లేకుండా ఉండేది. ఎప్పటి కప్పుడు బఫర్ స్టాకు తెచ్చి పెట్టేవారు. ఇప్పుడేమో మందులన్నీ ఖాళీ అయ్యాయి. ఈ మందులు రావడానికి మరో మూడు మాసాలు పట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదిగో ఇప్పుడు అప్పుడు అంటూ జాప్యం చేస్తున్నారని ఓ పీహెచ్‌సీ డాక్టర్ వాపోయారు.

బయట షాపులో తెచ్చుకున్నా



ప్రసవం కోసం నా బిడ్డ రాజేశ్వరిని సర్వజనాస్పత్రిలో చేర్పించాం. బీపీ ఎక్కువగా ఉందని వైద్యులు చెప్పారు. కేవలం మూడు మాత్రలు ఇచ్చారు. స్టాక్ అయిపోయిందని చెప్పారు. దీంతో ఈ నెల 1న టవర్‌క్లాక్ సమీపంలోని ఓ మెడికల్ స్టోర్‌లో మందులు తెచ్చుకున్నాం. రూ.144 ఖర్చు అయ్యింది. దూరాభారం నుంచి వచ్చిన మాలాంటి వారితో ఇలా ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేయించడం సరికాదు.
– లింగమ్మ, టీ వీరాపురం, రాయదుర్గం

టైఫాయిడ్ మందులు లేవంటున్నారు



కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని కురాకుల తోటలో నివాసం ఉంటున్నా. ఒంటిమిద్ది అర్బన్ హెల్త్ సెంటర్లో టైఫాయిడ్ జ్వరానికి మందులు లేవంటున్నారు. గ్లూకోజ్ బాటిల్ పెట్టడానికి ఐవీ సెట్లు అందుబాటులో లేవు. ఇక్కడి నుంచి సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోవాలంటే ఆటోకు రూ.100 ఖర్చు అవుతుంది.
– తిమ్మరాజు, కళ్యాణదుర్గం

ప్రైవేటుగా కొంటే డబ్బులు ఇప్పిస్తాం



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మందుల కొరత లేదు. 95 శాతం మందులు ఉన్నాయి. ఏదైనా ఇండెంట్ నమోదు చేయడంలో ఆలస్యమైతేనే మందుల జాప్యం జరుగుతుంది. రోగులు ఎక్కడైనా మందులు కొనుగోలు చేసి ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకుంటాం. సర్జికల్ వస్తువులకు పెద్దగా కొరత లేదు.
– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఏయే మందులు ఆస్పత్రుల్లో లేవంటే..

మందు పేరు	ఏ జబ్బుకు
లాల్‌బటాలాల్ 2 ఎంఎల్ ఇంజెక్షన్	తీవ్ర రక్తపోటు/ హైపర్‌టెన్షన్
పిరిడాక్సిన్ క్లోరైడ్ 10 ఎంఎల్ ఇంజెక్షన్	నరాల బలహీనత, రక్తహీనత
క్లోటిమాజోల్	గర్భాశయ ఇన్ఫెక్షన్లకు
బూపావాకెయిన్ 4	లోకల్ అనస్థీషియా
అమినో యాసిడ్ 500 ఎంఎల్ ఇంజెక్షన్	గాయాలు మానడం, న్యూట్రిషనల్
ఫ్లూకనోజోల్ 200	అలర్జీ నియంత్రణకు
లాక్టొలోజ్ సొల్యూషన్	మలబద్ధకం
బీ12 1ఎంఎల్	ఎనీమియా
అమాక్సిలిన్ క్లావలిక్ యాసిడ్ 625 ఎంజీ	యాంటీబయోటిక్
అమాక్సిలిన్ క్లావలిక్	యాంటీబయోటిక్
బెటమెథాజోన్ 2	స్టిరాయిడ్స్
ససినోకోలిన్ 10	పెయిన్ కిల్లర్
ఎల్‌పీ నీడిల్ 25 సైజ్	కుట్లు వేసే సూది
నైట్రో గైసెరిన్ 2	గుండె సంబంధిత
హైసోన్ బుటిలో బ్రోమైడ్ 2 ఎంఎల్	కడుపునొప్పి/ గ్యాస్ట్రిక్
గ్లైకోపారిలేట్ ఇంజెక్షన్	తిమ్మిర్ల నియంత్రణకు
మెట్రోనిడజోల్ 100	బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు
నార్తొస్టీరోన్ 5 ఎంజీ	రుతుక్రమంలో వచ్చే లోపాల నియంత్రణకు
యాంటీబాక్టీరియల్ సూచర్1 సైజ్	ఆపరేషన్ సమయంలో కుట్లు వేసే దారం
అమాక్సిలిన్ క్లావలిక్	యాంటీబయోటిక్స్
పొటాషియం 625	యాంటీబయోటిక్స్
గ్లూకోపైరేలేట్ 2	యాంటీబయోటిక్స్
హైసైన్ బుటిల్‌బ్రొమైడ్ 2	యాంటీబయోటిక్స్
బెట్‌సామెథజోన్ 2	యాంటీబయోటిక్స్

పల్లెలను స్వచ్ఛతకు నిలయాలుగా మార్చాలి



సత్కారం అందుకున్న ఎంపీడీఓలు, పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ చేతన్, అధికారులు

- 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపు సభలో కలెక్టర్ చేతన్
- గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులు

పుట్టపర్తి అర్బన్: ప్రతి పల్లెను స్వచ్ఛతకు నిలయంగా మార్చాలని, అదే బాపూజీకి మనమిచ్చే నిజమైన నివాళి అని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. 16 రోజులుగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' ముగింపు కార్యక్రమాన్ని బుధవారం పుట్టపర్తి మండలం కప్పలబండ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దన్న అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో కలెక్టర్ చేతన్ మాట్లాడారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రతి గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడూ కృషి చేయాలన్నారు. సెప్టెంబర్ 13వ తేదీ నుంచి ఉద్యమంలా చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమాలను ఏడాది పొడవునా కొనసాగించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం కలిగించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా చెత్తదిబ్బలు లేకుండా చూడాలన్నారు. ఆయా ప్రాంతాలను చూడ చక్కని ప్రదేశాలుగా మలచి మొక్కలు నాటి సెల్ఫీ పాయింట్లుగా తీర్చిదిద్దాలన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి కాలువలు, రోడ్లు, వీధులు శుభ్రం చేసిన సఫాయి మిత్రులను అందరూ గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా 32 మండలాల్లోని పారిశుధ్య కార్మికులను, ముగ్గురు ఎంపీడీఓలను, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులను, కళాకారులను ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. అంతకుముందు గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ చేతన్ ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి శివకుమారి, పశు సంవర్ధక శాఖ జేడీ శుభదాస్, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీఓ అశోక్‌కుమార్ రెడ్డి, నాయకులు శ్రీరాంరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు కత్తెర

- అర్హులకూ పింఛన్ అందకుండా టీడీపీ నేతల అడ్డు
- ప్రతి నెలా పింఛన్ మొత్తం పంపిణీలో సమస్య
- రాప్తాడు, ధర్మవరం పరిధిలోనే అధికం
- వందల మందికి ఇవ్వకుండా కక్ష సాధింపు
- విచారణ పేరుతో జాప్యం చేస్తోన్న అధికారులు



సాక్షి, పుట్టపర్తి

'ఇది మంచి ప్రభుత్వం' అని చెప్పుకొని ఇంటింటికీ తిరుగుతున్న టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీలో కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. అర్హులపైనా ఆరోపణలు చేస్తూ పింఛన్ అందకుండా వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో ప్రతి నెలా ఒకటో తారీఖు రాగానే.. పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేయాల్సిన దుస్థితి నెలకొంది. మాజీ మంత్రి పరిటాల సునీత ప్రాతినిధ్యం వహిస్తోన్న రాప్తాడు, మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తోన్న ధర్మవరంలో పింఛన్ల సమస్య తలెత్తుతోంది. టీడీపీ నేతల అండ చూసుకుని గ్రామాల్లోని ఆ పార్టీ కార్యకర్తలు పింఛన్ లబ్ధిదారులపై లేనిపోని ఫిర్యాదులు చేస్తున్నారు. దీంతో అధికారులు విచారణ చేసిన తర్వాత పింఛన్ సొమ్ము అందజేస్తామని మాట దాటవేస్తున్నారు. దీంతో అధికారులు, సచివాలయాల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణ చేస్తున్నారు. ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు ఇస్తారో? లేదో? తెలీని పరిస్థితి. కొన్ని చోట్ల నాలుగైదు తేదీల్లో కొందరికి ఇస్తున్నారు. టీడీపీ నాయకులు చెబితే... వెంటనే పింఛన్ మొత్తం ఇచ్చేస్తామని సచివాలయ ఉద్యోగులే చెబుతుండటం గమనార్హం.

అనర్హులుగా ఫిర్యాదు

గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను టీడీపీ నాయకులు టార్గెట్ చేశారు. వారిని అనర్హులుగా భావిస్తూ.. జాబితా సిద్ధం చేసి.. విచారణ చేయాలని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ అధికారులు విచారణ పూర్తి చేశారా? లేదా? అనేది తెలియరాలేదు. ఇదే విషయంపై జిల్లా అధికారులను వివరణ కోరగా.. విచారణ పూర్తయి.. అనర్హులుగా తేలితేనే జాబితా నుంచి తొలగిస్తామని, అప్పటి వరకు పింఛన్ అందజేయాల్సిందేనన్న సమాధానం వస్తోంది. సచివాలయ ఉద్యోగులు పింఛన్ ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నప్పటికీ.. టీడీపీ నేతల ఒత్తిళ్లతో ఇవ్వకుండా సతాయిస్తున్నట్లు తెలుస్తోంది.

విచారణ చేసేదెన్నడు?

జూలై నెలలోనే కనగానపల్లి, రామగిరి, బత్తలపల్లి మండలాల్లో టీడీపీ నేతల నుంచి ఎంపీడీఓ లకు ఫిర్యాదులు వెళ్లాయి. వెంటనే జాబితాలో ఉన్న వారికి నోటీసులు పంపించారు. కానీ విచారణ ఎంతమేరకు పూర్తి చేశారనే విషయం తెలియరాలేదు. కానీ జాబితాలో పేర్లు ఉన్న వారందరికీ పింఛన్ల పంపిణీలో ప్రతి నెలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తే కానీ, దక్కని పరిస్థితి. ప్రతి నెలా ఆయా మండలాల్లో వందల మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పింఛన్ మొత్తం ఇవ్వాల్సిందే

ఎన్టీఆర్ పింఛన్ లబ్ధిదారుల అర్హతపై జిల్లాలో అక్కడక్కడా ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలిస్తున్నాం. అయితే అనర్హులుగా తేల్చే వరకూ పింఛన్ పంపిణీ చేయాల్సిందే. ఇటీవల పలు మండలాల్లో కొందరు లబ్ధిదారులు అనర్హులంటూ ఫిర్యాదులు అందగా, వాటిని ఆయా ఎంపీడీఓలకు పంపాం. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక పంపుతారు. అనర్హులుగా తేలిస్తే తప్ప పింఛన్ పంపిణీ ఆగదు. అర్హులకు ఏ ఒక్కరికీ అన్యాయం చేయకూడదు. అక్టోబర్ నెలకు సంబంధించి జిల్లాలో 98.22 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేశాం.
– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

దేవీ వైభవం

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో గ్రామ దేవత సత్తెమ్మ



నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సత్తెమ్మ దేవాలయం

పుట్టపర్తి టౌన్: దేవీశరన్నర రాత్రి ఉత్సవాలకు జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారంతో భాద్రపద మాసం ముగియగా, గురువారం నుంచి ఆశ్వీజం ప్రారంభం అవుతోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కూడా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే అమ్మవారి ఆలయాలను దీపకాంతులతో అలంకరించారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సత్తెమ్మ ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, చిత్రావతి ఒడ్డున, ఎనుములపల్లి వద్ద ఉన్న దుర్గామాత ఆలయాలు ఇప్పటికే ముస్తాబయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా జగన్మాత తొమ్మిది విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలు జరుగనున్నాయి. రోజు సాయంత్రం సాంస్కృతిక సంబరాలు ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

దళితుడిపై 'తెలుగు తమ్ముడి' దాడి

- అప్పుగా తీసుకున్న డబ్బు అడిగినందుకు దౌర్జన్యం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- ఐదేళ్ల క్రితం రూ.80 వేలు ఇచ్చామన్న దళితులు



ముమ్మనేని రవి ప్రకాశ్ నాయుడు (ఫైల్)



గాయాలను చూపిస్తున్న కేశవయ్య, చిత్రంలో భార్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లా కేంద్రం, ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో తెలుగు దేశం పార్టీ కార్యకర్త రౌడీ అవతారమెత్తి దళితులను పట్టి పీడిస్తున్నాడు. డబ్బులు అప్పుగా తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడు. గట్టిగా నిలదీసిన వారిని రాత్రివేళల్లో కాపుకాచి చితకబాదుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. టీడీపీ కార్యకర్త ముమ్మనేని రవి ప్రకాశ్‌నాయుడు మంగళవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి వచ్చి దళిత సామాజిక వర్గానికి చెందిన కేశవయ్యను కర్రలతో చితకబాదారు. పోలీసులకు చెబితే అంతు చూస్తానంటూ బెదిరించినట్లు బాధితుడు వాపోయాడు. డబ్బు తిరిగి అడుగుతావా అంటూ దబాయించినట్లు కేశవ భార్య ఆవేదన వ్యక్తం చేసింది.

ఐదేళ్లుగా ముప్పుతిప్పలు

ధర్మవరం మండలం దర్శనమల గ్రామానికి చెందిన కేశవయ్య దంపతులు కొన్నేళ్లుగా పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జంక్షన్ వద్ద ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్ల క్రితం వారి వద్ద ఉన్న రూ.80 వేల నగదును టీడీపీ కార్యకర్త రవిప్రకాశ్‌నాయుడు బలవంతంగా తీసుకున్నాడు. తర్వాత తిరిగి ఇస్తానని చెప్పాడు. ఐదేళ్ల నుంచి ఇవ్వకుండా మాట దాటవేస్తూ వచ్చాడు. అప్పు తీసుకుని చాలా రోజులైందని, అవసరం ఉన్నందున తిరిగి ఇవ్వాలని కేశవయ్య దంపతులు నాలుగు రోజుల క్రితం రవిప్రకాశ్‌ను నిలదీశారు. దీంతో వారిపై ఆగ్రహంతో ఉన్న రవిప్రకాశ్ నాయుడు సమయం చూసుకుని మంగళవారం రాత్రి రోడ్డు పక్కన వెళ్తున్న కేశవయ్యను చితకబాదాడు.

ఎవరీ రవిప్రకాశ్?

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కమ్మవారిపల్లికి చెందిన ముమ్మనేని రవిప్రకాశ్‌నాయుడు వివాదాస్పద వ్యక్తి. నాలుగైదు పెళ్లిళ్లు అయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏడాదికో మహిళను తెచ్చి ఇంట్లో పెట్టుకోవడం.. ఉన్న వారిని తరిమేయడం అలవాటుగా మార్చుకున్నాడు. అడ్డు మాట్లాడిన వారిపై తిరగబడతాడు. ఇతనిపై ఇప్పటికే పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. గతంలోనూ దౌర్జన్యాలకు దిగిన సందర్భాలున్నాయి. మహిళలను మోసం చేసిన ఘటనలూ ఉన్నాయి. ఎవరిదగ్గర అప్పు తీసుకున్నా వెనక్కి ఇవ్వడని. నిలదీస్తే దాడులకు దిగుతాడని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కేశవయ్యపై కూడా దాడి చేశాడని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజున రవిప్రకాశ్ నాయుడు వేట కొడవలి తీసుకుని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద వీరంగం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపుర ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ 1938) 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయనగరం వేదికగా రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మహాసభలకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆ శాఖ నాయకులు విడుదల చేసి, మాట్లాడారు. సమాజ శ్రేయస్సు, విద్యా ప్రగతి, ఉపాధ్యాయ సంక్షేమం లక్ష్యాలుగా 80 సంవత్సరాలుగా ఫెడరేషన్ సాగిస్తున్న పోరాటాలను వివరించారు. 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకుంటున్న సందర్భంగా మేధావులు, విద్యావంతులు, సామాజిక ప్రజా కళాకారులు, ఉపాధ్యాయులు, జిల్లాలోని ఏపీటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా భారత స్వతంత్ర సమరయోధులు విప్లవ శంఖారావం షహీద్ భగత్‌సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జన్మోహన్ సింగ్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖరరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీక్, గౌరవాధ్యక్షుడు వరప్రసాద్, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్, సత్యప్రసాద్, రవీంద్ర, ఫక్రుద్దీన్, గోవిందరెడ్డి, తిరుపాల్ నాయక్, బాలాజీ నాయక్, ఆదినారాయణ పాల్గొన్నారు.

జెడ్పీలో ఉద్యోగుల సందడి

అనంతపురం సిటీ: బదిలీ ఉత్తర్వుల కోసం తరలి వచ్చిన ఉద్యోగులతో జిల్లా పరిషత్ కార్యాలయం బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కిటకిటలాడింది. బదిలీల నోటిఫికేషన్ జారీ కాగానే మొత్తం 274 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 40 మంది ఎంపీడీఓలు, 234 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు ఉన్నారు. ఇందులోనూ ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు 103 మందిలో ఆరుగురు ఎంపీడీఓలు, 97 మంది మినిస్టీరియల్ ఉద్యోగులు ఉన్నారు. ఆరుగురు ఎంపీడీఓలతో పాటు 97 మంది మినిస్టీరియల్ స్టాఫ్‌ను బదిలీ చేస్తూ జెడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఐదేళ్లు పూర్తి కాకుండా వివిధ కారణాలతో రిక్వెస్ట్ బదిలీలకు మొత్తం 153 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 34 మంది ఎంపీడీఓలు, 119 మంది మినిస్టీరియల్ ఉద్యోగులకు స్థానచలనం కలిగించారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ కింద 27 మంది మినిస్టీరియల్ ఉద్యోగులను బదిలీ చేశారు. వీరందరికీ బుధవారం బదిలీ ఉత్తర్వులు అందించారు. కాగా, బదిలీల ప్రక్రియ ప్రారంభానికి నెల రోజుల ముందు నుంచే ఓ ఉద్యోగి క్యాడర్‌ను బట్టి రేటు నిర్ణయించి వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

11 మండలాల్లో వర్షం

ప్రశాంతి నిలయం: వాతావరణ మార్పుల నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకూ జిల్లాలోని 11 మండలాల్లో వర్షం కురిసింది. ఒక్కరోజే 120.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా రొళ్ల మండలంలో 40.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక అగళి 27.6 మి.మీ, పెనుకొండ 10.2 మి.మీ, హిందూపురం 8.8 మి.మీ, గుడిబండ 8.2 మి.మీ, గోరంట్ల 6.4 మి.మీ, లేపాక్షి 6.2 మి.మీ, రొద్దం 5.0 మి.మీ, మడకశిర 3.0 మి.మీ, చిలమత్తూరు 2.6 మి.మీ, అమరాపురం మండలంలో 2.4 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

రైతు బజారు లేక బేజారు

- వ్యాపారులకే సొంతమైన తాత్కాలిక రైతు బజారు
- దళారుల బెడద తప్పలేదంటున్న రైతన్నలు
- చొరవ చూపని అధికారులు

కదిరి: పంట పండించడం ఎంత కష్టమో... పండిన పంటను అమ్ముకోవడం కూడా రైతులకు మరింత కష్టంగా మారింది. కదిరి నియోజకవర్గంలోని 6 మండలాలే కాకుండా పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ, అమడగూరు, ఓడీచెరువు మండలాలతో పాటు ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ ఇలా మొత్తం 10 మండలాల రైతులకు కదిరి ప్రధాన వ్యాపార కేంద్రం. ఎప్పటి నుంచో ఇక్కడ రైతు బజారు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. రైతు బజారు లేకపోవడంతో తాము పండించిన పంటను రైతులు కదిరి కూరగాయల మార్కెట్‌లో అమ్ముకోక తప్పడంలేదు. ఇక్కడ కూడా వ్యాపారులు తాము చెప్పిందే వేదంగా వ్యవహరిస్తుండడంతో అన్నదాత కష్టాలు రెట్టింపు అయ్యాయి. తాము నిర్ణయించిందే ధర.. తాము వేసిందే తూకం.. అనే రీతిలో దళారులు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

అది వ్యాపారుల బజార్

కదిరిలోని జీవిమాను కూడలిలో రోడ్డు కిరువైపుల ఉన్న స్థలంలో దాదాపు 15 ఏళ్ల క్రితం తాత్కాలిక రైతు బజారు ఏర్పాటు చేశారు. త్వరలో రైతు బజారుకు ప్రత్యేక స్థలం కేటాయించి పక్కా భవనాలతో పాటు రైతులు విశ్రాంతి తీసుకునేందుకు మరికొన్ని గదులు ఏర్పాటు చేస్తామని అప్పట్లో నాయకులు, అధికారులు హామీనిచ్చారు. కానీ ఇప్పటి దాకా ఆ హామీ అమలుకు నోచుకోలేదు. రోడ్డు పక్కన కూర్చొని పంట ఉత్పత్తులు అమ్ముకోవడం చిన్న చూపుగా భావించిన రైతులు చివరకు అక్కడి వ్యాపారుల (దళారులు)కు వారు చెప్పిన ధరతోనే పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో చాలా మంది రైతుల పంట ఉత్పత్తులను కదిరి రైతు బజార్‌కు తీసుకురావడం మానేశారు. ఈ క్రమంలో కొందరు చిరు వ్యాపారులే మండీల్లో కొనుగోలు చేసిన కూరగాయలను రైతు బజారు పేరుతో విక్రయాలు సాగిస్తున్నారు.

ప్రజలకు ధరల సెగ

కూరగాయల మండీల్లో రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసే 33 కిలోల టమాట బాక్స్‌కు కేవలం రూ.110 మాత్రమే చెల్లిస్తున్నారు. అదే టమాటను తిరిగి కిలో రూ.20 చొప్పున వినియోగదారులకు అమ్ముతున్నారు. ఈ లెక్కన ఒక్కో బాక్స్‌పై రూ.550 లాభం గడిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడంతో పాటు ప్రజలకు ధరల సెగ తప్పడం లేదు.



జీవిమాను సర్కిల్‌లో ఉన్న తాత్కాలిక రైతు బజారులో కూరగాయల విక్రయాలు

రైతు బజార్ ఉండాల్సిందే



రైతులతో పాటు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా రైతు బజారు ఏర్పాటు చేయాలి. అప్పుడే అందరికీ బాగుంటుంది. మహిళలే నేరుగా అక్కడికెళ్లి కూరగాయలు కొనుక్కోవచ్చు. అందుకే పట్టణ నడిబొడ్డున రైతుబజారు ఉంటే బాగుంటుంది. స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌తో పాటు అధికారులు చొరవ చూపి అనువైన స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– సుబ్బిరెడ్డి, రైతు సంఘం నాయకుడు, కదిరి

రైతుబజారు ఏర్పాటు చేయాలి



ఇటీవల రైతులు ఎక్కువగా కూరగాయల సాగుపై దృష్టి పెట్టారు. అయితే కదిరిలో ప్రత్యేకంగా రైతు బజారు లేకపోవడంతో మండీల్లో బడా వ్యాపారులు చెప్పిన ధరకే పంటను అప్పగించాల్సి వస్తోంది. అదే రైతు బజారు ఉంటే నేరుగా వినియోగదారుడికే అమ్ముతారు. దీంతో రైతుకూ, వినియోగదారుడికే లాభదాయకంగానే ఉంటుంది.

– అశోక్‌రెడ్డి, రైతు, తనకల్లు

ముని్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- డిమాండ్ల సాధనకు యూటీఎఫ్ నాయకుల సత్యాగ్రహ దీక్ష

ధర్మవరం అర్బన్: మున్సిపల్ టీచర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన జరిగి దాదాపు 10 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు సౌలభ్యాలు అందడం లేదని మండిపడ్డారు. మున్సిపల్ హైస్కూళ్లలో నేటికీ తగినంత మంది సబ్జెక్ట్ టీచర్లు లేరన్నారు. ప్రమోషన్లు, బదిలీలు సక్రమంగా జరగడం లేదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకూ అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు పునరుద్ధరించాలని, మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించాలని ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఆయా పోస్టుల్లో మున్సిపల్ టీచర్లకు ప్రమోషన్లు కల్పించాలని, మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓలుగా నియమించాలని, జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. దీక్షకు జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ మద్దతు తెలిపారు. కార్యకర్మంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, హరికృష్ణ, సాయిగణేష్, లక్ష్మయ్య, రాంప్రసాద్, అమర్‌నారాయణరెడ్డి, లక్ష్మినారాయణ, కృష్ణకిషోర్, ఆంజనేయులు, నాగరాజు, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

మా నాన్న ఆచూకీ తెలపండి

- రైల్వే పోలీసులను అభ్యర్థించిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగి కుటుంబసభ్యులు



అదృశ్యమైన కృష్ణలింగన్న మడివాల్

గుంతకల్లు: రెండు నెలల క్రితం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో కనిపించకుండా పోయిన తమ తండ్రి ఆచూకీని తెలపాలంటూ స్థానిక రైల్వే పోలీసులను గుజరాత్‌లో స్థిరపడిన ఆర్మీ విశ్రాంత ఉద్యోగి కృష్ణలింగన్న మడివాల్ కుటుంబసభ్యులు వేడుకున్నారు. కుమారుడు కుమారస్వామి తెలిపిన మేరకు... బళ్లారి జిల్లాకు చెందిన కృష్ణలింగన్న మడివాల్ ఆర్మీలో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత గుజరాత్‌లో స్థిరపడ్డారు. ఈ నేపథ్యంలో తరచూ బళ్లారికి వెళ్లేవారు. జూలై 31న గుజరాత్ నుంచి బళ్లారికి వెళ్లిన ఆయన అనంతరం తిరుగూ ప్రయాణంలో గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే గుజరాత్‌కు వెళ్లే రైలు మిస్ కావడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మరుసటి రోజు వస్తానని తెలిపారు. అయితే మరుసటి రోజు కూడ ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. స్పందన లేకపోవడంతో ఆగస్టు 14న గుంతకల్లుకు చేరుకుని జీఆర్‌పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు జూలై 31న సీసీ ఫుటేజీలను రైల్వే పోలీసులు పరిశీలించి గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో తచ్చాడుతున్న కృష్ణలింగన్న మడివాల్‌ను గుర్తించారు. ఆ తర్వాత ఆయన ఎక్కడికి వెళ్లింది స్పష్టంగా లేదు. ఘటనపై అప్పట్లో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటి వరకూ కృష్ణలింగన్న మడియాల్ ఆచూకీని పసిగట్టలేకపోయారు. దీంతో తమ తండ్రి ఆచూకీ తెలపాలంటూ బుధవారం మరోసారి బాధిత కుటుంబసభ్యులు గుంతకల్లు రైల్వే పోలీసులను కలసి అభ్యర్థించారు.

ఓ చావు.. ఓ పుట్టుక!

- పావగడలో యువకుడి బలవన్మరణం
- ఆత్మహత్య చేసుకున్న గంటల వ్యవధిలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన భార్య



అభిషేక్ (ఫైల్)

పావగడ: కారణాలు ఏమో స్పష్టంగా తెలియదు కానీ... ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చోటు చేసుకున్న గంటల వ్యవధిలోనే పండంటి మగబిడ్డకు భార్య జన్మనిచ్చింది. హృదయాలను ద్రవింపజేసిన ఈ ఘటన పావగడలో చోటు చేసుకుంది. వివరాలు... స్థానిక కాళిదాస నగర్‌కు చెందిన మూర్తి, భూదేవి దంపతుల కుమారుడు మడివాళ అభిషేక్ (27) పావగడకు చెందిన రజియాభానును మతాంతర వివాహం చేసుకున్నాడు. వీరి కాపురం చాలా అన్యోన్యంగా సాగుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో గర్భం దాల్చిన భార్య రజియాభానుకు నెలలు నిండడంతో మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రికి అభిషేక్ పిలుచుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాడు. పరీక్షించిన వైద్యులు సిజేరియన్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో భార్యను ఆమె పుట్టింట్లో వదిలి రాత్రి తాను సొంతింటికి చేరుకున్నాడు. సిజేరియన్ చేస్తే భార్య ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని భయపడిన అభిషేక్... ఆమె లేకపోతే తన జీవితం వృథా అని భావించి తీవ్ర మానసిక సంఘర్షణకు లోనై ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రుల సమాచారం మేరకు సీఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. అదే ఆస్పత్రిలో పురిటి నొప్పులతో చేరిన భార్య రజియాభాను... కాసేపటి తర్వాత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కాగా, అభిషేక్ ఆత్మహత్యకు సరైన కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి



గాయపడిన సందీప్

సాక్షి టాస్క్‌ఫోర్స్: పుట్టపర్తి పట్టణంలోని 8 వార్డు గుట్ట ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు 20 మంది దాడి చేశారు. బుధవారం సాయంత్రం చిన్నపాటి విషయానికి 20 మంది యువకులు గొడవ పెట్టుకుని వైఎస్సార్‌సీపీకి చెందిన సందీప్, గోపాల్‌ను చుట్టుముట్టి రాడ్లతో కొట్టారు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ నరేష్ అక్కడకు చేరుకునేలోపు టీడీపీ కార్యకర్తలు పరారయ్యారు. క్షతగాత్రులను సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. గాయపడిన వారిలో సందీప్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

‘కూటమి’ మూల్యం చెల్లించుకోకతప్పదు



విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలంటూ దీక్ష చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్నందుకు కేంద్రంలోని కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట విశాఖ ఉక్కు పోరాట సమన్వయ సమితి ఆధ్వర్యంలో కార్మిక సంఘాలు నిరసన దీక్షలు చేపట్టాయి. సమితి కో-కన్వీనర్ యేసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ రాజారెడ్డి, కో-కన్వీనర్లు నాగేంద్రకుమార్, సురేష్ మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగంతో నాడు సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను అడ్డదారిలో కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు సిద్ధపడిందని మండిపడ్డారు. నాడు పోరాటాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను నేడు అవే పోరాటాలతో ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక, ప్రజా సంఘాలపై ఉందన్నారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం చేసిందన్నారు. ఉక్కు పరిశ్రమను నష్టాల్లో నెట్టడానికి మోదీ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి పరిశ్రమను మరింత నష్టాల్లోకి నెట్టివేస్తోందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉక్కు పరిశ్రమను దారదత్తం చేసి వేలాది మంది కార్మికులను రోడ్డు పాలు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమన్నారు. ఉక్కు పరిశ్రమను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేసే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఓ వైపు ప్రచారం చేస్తూ... మరోవైపు 4,290 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్ర చేయడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కానివ్వబోమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన టీడీపీ, జనసేన పార్టీ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిలుపుదలకు ఎంపీలు పార్లమెంట్‌లో పోరాటం చేయాలన్నారు. లేకుంటే ప్రజాప్రనిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు రాజేష్‌గౌడ్, రామాంజి, కృష్ణుడు, చిరంజీవి, వెంకటనారాయణ, నాగరాజు, కుళ్లాయిస్వామి, వేమన, వీరేంద్ర, భాస్కర్ బాబు, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రేపు

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్ టీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 4న తాడేపల్లిలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి బుధవారం వెల్లడించారు. సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులందరూ తప్పక హాజరై, విద్యారంగంతో పాటు అసోసియేషన్ బలోపేతానికి చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.నాగిరెడ్డి, జి.శ్రీధర్‌గౌడ్ కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రొళ్ల: మండలంలోని పిల్లిగుండ్ల యల్లమ్మ కాలనీలో నివాసముంటున్న శివన్న గారి ఈశ్వరప్ప ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఇంటికి తాళం వేసి భార్యాపిల్లలతో కలసి ఈశ్వరప్ప పొలం వద్ద ఉన్న గొర్రెల మందకు కాపలాకు వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి చేరకుని చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి పరిశీలిస్తే బీరువాలో భద్ర పరచిన 10 గ్రాముల బంగారు నగలు, రెండు జతల వెండి పట్టీలు, రూ.18,800 నగదు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కియా ఉద్యోగి అనుమానాస్పద మృతి

ముదిగుబ్బ: మండలంలోని తప్పెటవారిపల్లికి చెందిన సత్యనారాయణ (21) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న నారాయణకు ఇద్దరు కుమారులు కాగా వీరిలో చిన్న కుమారుడు సత్యనారాయణ కియా పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. సెలవుపై ఇంటికి వచ్చి ఆయన బుధవారం రాత్రి పొలం వద్దకు వెళ్లాడు. ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అక్కడకెళ్లి పరిశీలించారు. పొలంలో విగతజీవిగా పడి ఉన్న సత్యనారాయణను గమనించి బోరున విలపించారు. మృతదేహం పక్కనే విద్యుత్ తీగలు ఉన్నాయి. కేసు నమోదు చేసిన పోలీసులు... విద్యుత్ షాక్‌తో మృతి చెందాడా? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

అలరించిన ‘దంత వేదాంతం’



నృత్య రూపకంలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: ఆధునిక సమాజంలో ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతలను సంతులనం చేస్తూ మానవుడు ఎలా జీవించాలనే అంశాలను వివరిస్తూ ప్రదర్శించిన దంత వేదాంతం నృత్య రూపకం భక్తులను ఆలరించింది. పర్తి యాత్రలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, పాలమూరు జిల్లాలకు చెందిన సత్యసాయి భక్తులు బుధవారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం తాందూలార్చన, సత్యసాయి అష్టోత్తరం పఠనం గావించారు. సాయంత్రం దంత వేదాంతం పేరుతో సత్యసాయి యూత్, బాలవికాస్ విద్యార్థులు నృత్యరూపకం ప్రదర్శించారు.